ఆశల పల్లకిలో..

పేదల ఇంట దీపం వెలిగిస్తాం అన్నారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. ఇప్పుడు చేతికి పట్టా ఇస్తున్నాం.. ఏడాదిలోగా పక్కా రిజిస్ట్రేషన్ చేస్తామని భరోసా ఇచ్చారు. పట్టాలను రెండేళ్ల తర్వాత విక్రయించుకోవచ్చని పొందుపర్చారు. దీంతో చాలా మంది నిరుపేదలు పిల్లల వివాహాలు, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో విక్రయాలు చేశారు. ఇప్పుడు కొనుగోలు చేసిన వారితో పాటు విక్రయించుకోని లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

- 269 జీవో పట్టాల రిజిస్ట్రేషన్ కోసం ఎదురు చూపులు
- కూటమి పాలకులు స్పందించాలని వేడుకోలు



గణపతినగర్ కొండ ప్రాంతంలో ఉంటున్న వారికి కేటాయించిన పట్టా (ఫైల్)



లబ్ధిదారులకు ములగాడ తహసీల్దార్ సంతకం చేసి ఇచ్చిన పట్టా (ఫైల్)

మల్కాపురం: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొండవాలు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్న వారిని గుర్తించి 269 జీవో కిందట అట్టహాసంగా పట్టాలు జారీ చేశారు. వాటిని రెండేళ్ల తర్వాత విక్రయించుకోవచ్చునని పేర్కొన్నారు. ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రకటించారు. పదేళ్లు గడిచినా ఆ పట్టాలకు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో లబ్ధిదారులబోదిబో మంటున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 40,58,59,60,61,62,63వ వార్డుల పరిధిలో అర్హులైన సుమారు 10 వేల మంది వరకు జీవో నెంబర్ 296 కింద ఇంటి పట్టాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇచ్చింది. ఏడాదిలోగా పట్టాలకు రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. ఎన్నికల కోడ్ రావడంతో రిజిస్ట్రేషన్ చేయలేదు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఉచితంగా రిజిస్ట్రేషన్

అనంతరం వచ్చిన ప్రభుత్వం పేదలకు ఇంటి పట్టాతో పాటు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి సర్వ హక్కులు కల్పించింది. సుమారు 6 వేల మంది వరకు 388 జీవో కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించింది. మిగిలిన వాటికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్న సమయంలో మరలా సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో కొంత మందికి రిజిస్ట్రేషన్లు నిలిచాయి.

కూటమి అధికారంలోకి రావడంతో..

మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నాడు టీడీపీ పాలకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పట్టాలు పొందిన వారికి అధికారంలోకి వచ్చిన వెంటనే రిజిస్ట్రేషన్ చేయిస్తామని హామీలు కురిపించారు. ఇప్పుడు ఆ విషయం ప్రస్తావించకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్ చేయాలి



ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో కూటమి తరఫున పోటీ చేసిన గెలిచిన ప్రస్తుత ఎమ్మెల్యే గణబాబు మా పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించి మాలాంటి పేదలకు భరోసా కల్పించాలి.

– కుంచాలమ్మ, లబ్ధిదారు

ఎదురు చూస్తున్నారు



100 గజాల్లోపు అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకున్న వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టాలు ఇవ్వడంతో పాటు పక్కా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చింది.అదే మాదిరిగా కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీ నెలబెట్టుకుంటుందని లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

– కుంచారావు, ములగాడ హౌసింగ్‌కాలనీ

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు సొంత గూడు కల నెరవేర్చారు. ఒక్కపైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసి పేదలకు భరోసా కల్పించారు. అదే మాదిరిగా కూటమి ప్రభుత్వం జీవో 269 పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయించి లబ్ధిదారులకు న్యాయం చేయాలి.

– రేవళ్ల సత్యనారాయణ, 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు

కులశేఖర్‌కు కళాపీఠం నివాళి



రచయిత కులశేఖర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాసేవా పీఠం సభ్యులు

గోపాలపట్నం: ప్రముఖ సినీ గేయ రచయిత, సింహాచలం నివాసి కులశేఖర్‌కు మంగళవారం గోపాలపట్నం కళాసేవా పీఠం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు గొరపల్లి బంగార్రాజు, కొంతం నూకరాజేశ్వరరావు మాట్లాడుతూ కులశేఖర్ పాత్రికేయ వృత్తిలో ఉంటూ గేయరచయితగా స్థిరపడ్డారని గుర్తు చేశారు. ఆయన సుమారు 150 సినిమాలకు పాటలు రాశారని తెలిపారు. కార్యక్రమంలో సోడదాసు సుధాకర్, పీఠం మాజీ అధ్యక్షుడు గొరకల రామదాసు, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి బెవర రమేష్, సభ్యులు టి. రామచంద్రరావు, జి. అప్పారావు, భాస్కర్, పాణిగ్రాహి, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభినందన

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల ఐడియాతాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏయూలో వివిధ భాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పర్యావరణహితంగా నిలిచే పరికరాలను అభివృద్ధి చేశారు. మొదటి స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు, రెండో స్థానంలో వారికి రూ. 2,500లు, ప్రశంసా పత్రాన్ని అందించారు. నిర్వాహకులను రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్ ధనంజయరావు ప్రత్యేకంగా అభినందించారు. నిర్వాహకులు ఇందిర, అపర్ణ పాల్గొన్నారు .

క్లుప్తంగా

89వ వార్డులో ప్రజాదర్బార్



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులో మంగళవారం ఎమ్మెల్యే గణబాబు ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, కొత్త రేషన్ కార్డుల కోసం అర్జీలు అందజేశారు. ఇంటి పన్నుల్లో పేరు మార్చాలని దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమావతి, 89వ వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, స్థానిక నాయకులు బొడ్డేటి విజయ్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

60వ వార్డులో..

మల్కాపురం: ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గణబాబు చెప్పారు. జీవీఎంసీ 60వ వార్డు పరిధి ఇందిరాకాలనీలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన పాల్గొని వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జోన్–5 కమిషనర్ రాము, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, పోలీస్ అధికారులు, రెవెన్యూ అధికారులు, విద్యుత్, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న మమత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన వృద్ధుడు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా, శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. మహాలక్ష్మి అనే వృద్ధుడి(78)కి కుటుంబ సభ్యులు ఎవరు లేకపోవడంతో ఏడాది నుంచి షెల్టర్‌లోనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందాడు. షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత విషయాన్ని ఎయిర్ పోర్టు పోలీసులుకు తెలియజేసి జ్ఞానాపురం శ్మశానవాటికలో అంత్య క్రియలు నిర్వహించారు.

ఎస్ఆర్ షాపింగ్ మాల్ పునః ప్రారంభం నేడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్ షాపింగ్ మాల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి

గోపాలపట్నం: కల్యాణి షాపింగ్ మాల్‌ను సరికొత్త హంగులతో ఎస్ఆర్ షాపింగ్ మాల్‌గా బుధవారం పునః ప్రారంభించబోతున్నామని ఎస్ఆర్ షాపింగ్ మాల్ డైరెక్టర్ ఎస్ఎల్‌వీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. 20 సంవత్సరాలుగా నాణ్యమైన వస్త్రాలు వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ హీరో కిరణ్ అబ్బవరం, స్థానిక ఎమ్మెల్యే గణబాబు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ రామ్‌మోహన్ రెడ్డి, బ్రాంచ్‌మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

అవయవ దాతల సంఘం అధ్యక్షుడిగా అప్పలనాయుడు

మహారాణిపేట: అవయవ దాతల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా మెరుగు అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మంగళవారం అఖిల భారత సంఘం వ్యవస్థాపకురాలు గూడురు సీతామహాలక్ష్మి అప్పలనాయుడుకు అందజేశారు. అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామానికి చెందిన ఎం. అప్పలనాయుడు ఉన్నత విద్యావంతుడే కాకుండా సమాజ సేవా తత్పరుడిగా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఎంపీటీసీగా వ్యవహరిస్తున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా

- సీపీ శంఖబ్రతబాగ్చి
- మల్కాపురం పోలీస్‌స్టేషన్ సందర్శన



మల్కాపురం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ శంఖ బ్రత బాగ్చి

మల్కాపురం: శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి సారించడంతో పాటు స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టాలని సీపీ శంఖబ్రత బాగ్చి మల్కాపురం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు. సీపీ బాగ్చి మంగళవారం మల్కాపురం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ ఆవరణలో సుమారు రూ.లక్ష వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్‌కు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా స్టేషన్‌కు వచ్చిన పలువురు ఫిర్యాదు దారులతో మాట్లాడారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీసీపీ -2 మేరీ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

మరీ ఇంత నిర్లక్ష్యమా!



చెత్తాచెదారంలో వేసిన బియ్యం బస్తాలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం పరిధిలోని ఓ రేషన్ దుకాణం నుంచి రేషన్ బియ్యం బస్తాలను వాహనంలోకి నింపే సమయంలో మంగళవారం కళాసీలు బస్తాలను మెట్లలాగ వినియోగించారు. రేషన్ డీలర్ సమక్షంలో కళాసీలు ప్రధాన గెడ్డ సమీపంలో దుర్గంధభరిత వాతావరణంలో నేలపై బియ్యం బస్తాలు ఇలా వేయడంతో అటుగా వెళ్లే ప్రజలు తప్పుపడుతున్నారు. ఆ సమయంలో చినుకులు పడడంతో బస్తాలు తడిచాయి. అదే బియ్యాన్ని విక్రయిస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎన్ఏడీ కార్మికుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



దీక్షా శిబిరం వద్ద కాగడాలతో నినాదాలు చేస్తున్న సీఈ యూనియన్ నాయకులు

ఎన్ఏడీ సీఈ యూనియన్ కాగడాల ర్యాలీ

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపోలో పని చేస్తున్న 36 మంది కార్మికులపై యాజమాన్యం అన్యాయంగా విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దీక్షా శిబిరం నుంచి సాకేత పురం అంబేడ్కర్ విగ్రహం వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఏడీ సీఈ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికులను భయపెట్టి.. ఉద్యమాన్ని అణిచివేయాలని చూస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ రక్షణ రంగ కార్మికులతో పాటు విశాఖలో ఉన్న పలు కార్మిక సంఘాలు తమ పోరాటానికి మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. కార్మికులకు అన్యాయం చేయడం తగదన్నారు. ఎన్ఏడీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 8న ఎన్ఏడీ మెయిన్ గేటు వద్ద దీక్షా శిబిరం నుంచి బైక్ ర్యాలీ జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు నూకరాజు, తదితర కార్మికులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో సంస్థ ప్రగతి



హెచ్ఎస్ఎల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ షిప్ బిల్డింగ్ డైరెక్టర్ గండి వెంకటేశ్వర్లును మంగళవారం బీఎంఎస్ నాయకులు కలిసి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నాయకులు మాట్లాడుతూ సంస్థ 5 ఆర్డర్లు దక్కించుకోవడంలో కీలక పాత్ర వహించిన చైర్మన్‌కు రుణపడి ఉంటామన్నారు. అతని కష్టం వృథా కాకుండా కార్మికులంతా సైనికుల్లా కష్టపడి పనిచేసి సంస్థ ప్రగతికి కృషి చేస్తామన్నారు.భవిష్యత్తులో ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను పర్మనెంట్ చేసే విధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ బీఎంఎస్ ప్రతినిధులు, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 పూజా రుసుం చెల్లించి దంపతులు పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులకు రైల్వే పాసులు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింధియా: ఎన్నో కష్టాలను అనుభవిస్తూ జీవితంలో ఉన్నతంగా ఎదిగిన దివ్యాంగులను యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు అన్నారు. 62వ వార్డు పరిధి మల్కాపురం ప్రకాష్‌నగర్‌లోని శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఎస్ఎస్ఎస్ జిల్లా ప్రొగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వాలు దివ్యాంగుల విద్యకు, ఆరోగ్యానికి, ఉపాధికి మరిన్ని నిధులు కేటాయించాలన్నారు. అనంతరం నిరుపేద దివ్యాంగులకు నిత్యావసర సరకులు, బస్సు, రైల్వే పాసులు సదరం కార్డులను అతిథుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. శ్రీ విఘ్నేశ్వర వెంకట సాయి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సింగింపల్లి శ్రీనివాసరావు , నాయకులు ధర్మేంద్ర, శివకుమార్, రాము, జోగిబాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలని ఆందోళన



కోరమాండల్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, మృతుడి కుటుంబ సభ్యులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలోని కోరమాండల్ పరిశ్రమ ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా మృతి చెందిన సారిక రమణ (36) కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, కోరమాండల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం నిరసన చేపట్టారు. దీంతో కోరమాండల్ కంపెనీ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మృతుడి కుటుంబానికి రూ. 50 లక్షల పరిహారం ఇవ్వాలని యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేయగా, చివరకు రూ.15 లక్షల పరిహారం ఇచ్చేందుకు సంస్థ అంగీకరించడంతో ఆందోళనను విరమించారు.

ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛభారత్



సేకరించిన చెత్తా చెదారంతో నాగార్జున గేటు వద్ద ఎన్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు

గోపాలపట్నం: ఎన్ఎస్‌టీఎల్‌లో మంగళవారం స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్ట్ డాక్టర్ బ్రహం వర్గీస్ ప్రారంభించారు. ఎన్ఎస్‌టీఎల్ సింహాద్రి గేట్, నాగార్జున గేట్ పరిశ్ర ప్రాంతాల్లో ఎన్ఎస్టీఎల్ ఉద్యోగులు, అధికారులు శాస్త్ర వేత్తలు శ్రమదానం చేసి రహదారులు, ఫుట్‌పాత్‌లు శుభ్రపరిచారు. ప్లాస్టిక్ వ్యవర్థాలు, చెత్తను సేకరించారు. అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు విడనాడి గుడ్డ సంచులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైవీఎస్ చంద్రశేఖర్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్ పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

- మూలకు చేరి తుప్పపట్టిన వాహనాలు
- చీకటి పడితే మందుబాబుల ఆగడాలు
- జాతీయ రహదారి సబ్‌వేల్లోనూ అదే పరిస్థితి
- అధికారులు స్పందించాలని స్థానికుల మొర



తాటిచెట్లపాలెం కూడలిలో నెలల తరబడి నిలిపిన భారీ వాహనాలు



కంచరపాలెంలోని గ్రీన్‌బెల్ట్‌లో నిలిపిన వాహనాలు



జాతీయ రహదారిలో తుప్పపట్టి మూలకు చేరిన వాహనం

కంచరపాలెం: జీవీఎంసీ 54, 55 వార్డుల పరిధిలో భారీ వాహనాలు, కార్లు, ఆటోల అక్రమ పార్కింగ్‌తో వాహన చోదకులు, స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన, అంతర్గ రహదారులపై భారీ లారీలు, ట్రావెల్స్ బస్సులు పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. తాటిచెట్లపాలెం కూడలి నుంచి కంచరపాలెం, అలాగే కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి జ్ఞానాపురం వెళ్లే మార్గాలు, ఊర్వశి కూడలి నుంచి కంచరపాలెం మీదుగా తాటిచెట్లపాలెం వెళ్లే జాతీయ రహదారి సబ్‌వేల్లో నెలల తరబడి వాహనాలు నిలిపి ఉంచేయడంతో వాహన చోదకులు, పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండేసి వరుసల్లో వాహనాలు నిలిపి మరమ్మతులు చేపట్టడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జాతీయ రహదారిలోని గ్రీన్‌బెల్ట్‌కు ఆనుకుని ఉన్న సబ్‌వేల్లో ఎన్నో నెలలుగా తుప్పుపట్టి మూలకు చేరిన కార్లు, ఇతర వాహనాలు నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో చెత్తా చెదారం, మట్టి గుట్టలుగా పేరుకుపోతోంది. ఇరుకు రోడ్లపై వాహనాలు నిలిపేస్తున్న కారణంగా కొన్నిసార్లు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్ల పక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవించి అటుగా వెళ్లే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోన్–5 టౌన్ ప్లానింగ్ అధికారులకు, సచివాలయ కార్యదర్శులకు స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి వినియోగం లేని, తుప్పుపట్టిన వాహనాలను తరలించాలని స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కంచరపాలెం ఫ్లైఓవర్ మార్గంలో ఎఫ్‌సీఐ గిడ్డంగికి వచ్చే లారీలు ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలకు అడ్డు లేకుండా పోతుంది. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు చేపడితే బాగుంటుందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ట్రాఫిక్ పోలీస్ అధికారులు, జోన్–5 టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించి నెలల తరబడి నిలిపిన వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

అగనంపూడి: గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ అన్నారు. దువ్వాడ పోలీస్టేషన్ ఆవరణలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందస్తు సమాచారం మేరకు దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలోని మంగళపాలెం వద్ద నిఘాపెట్టి ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు.